సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 23 । జూలై । 2023



ఆలయాలకు స్వయం ప్రతిపత్తి
దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలో ఉండి వార్షికాదాయం కేవలం రూ. 5 లక్షల్లోపు ఉన్న ఆలయాలు ఇకపై స్వతంత్రంగా వ్యవహరించనున్నాయి. -8లో..



ఆసుపత్రిలో విజిలెన్స్ తనిఖీలు
బద్వేలు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) లో శనివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. -8లో..

గరిష్టం/కనిష్టం
33.7/26.3

వాతావరణం
జిల్లాలో శనివారం 26.3 - 33.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

26, 27 తేదీల్లో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 26, 27 తేదీలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్‌ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీన పెండ్లిమర్రిలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, వేంపల్లెలోని ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు, 27న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటలకు, సీకే దిన్నెలోని ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 2.00 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. అల్ డిక్సన్ అసెంబుల్ ఆపరేటర్ కోసం మహిళా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు 18-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువతులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళా ఉంటుందన్నారు. ఎంపికైన వారు కొప్పర్తిలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 6305992081, 9542352809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

గర్భిణుల వివరాలు అప్‌లోడ్ చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతి గర్భిణికి చేసే స్కానింగ్‌లను ఫారం-ఎఫ్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ పీసీపీఎన్‌డీటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం కడప లోని స్కానింగ్ సెంటర్లను ఆయన అకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. స్కానింగ్ సెంటర్లు అనుమతి లేకుండా ఎవరైనా నిర్వహిస్తుంటే వారిపై పీసీపీఎన్‌డీటీ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్ తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ డమాలజిస్టు ఖాజా మోహిద్దీన్, పీసీపీఎన్‌డీటీ మానిటరింగ్ కన్సల్టెంట్ పాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారి

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న సిమెంటు ట్యాంకర్
- ఐదుగురి మృతి
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- 12 మందికి స్వల్ప గాయాలు
- మిన్నంటిన ఆర్తనాదాలు



ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్యాంకర్ లారీ



రోడ్డు ప్రమాదంతో నిలిచినపోయిన వాహనాలు

ఓబులవారిపల్లె: కడప- రేణిగుంట జాతీయ రహదారి 716 శనివారం సాయంత్రం రక్తమోడింది. అన్నమయ్య జిల్లాలోని ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సును సిమెంటు ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప ఐసీఎల్ నుంచి చెన్నైకి సిమెంటు పొడి లోడుతో వెళ్తున్న లారీ చిన్నఓరంపాడు డాబా హోటల్ వద్దకు రాగానే వేగంగా వచ్చి అదుపు తప్పింది. అదే సమయంలో తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. ట్యాంకర్ డ్రైవర్ వేగంగా రోడ్డుకు అటు, ఇటు తిప్పుతూ వస్తుండాన్ని గమనించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టారు. లారీ డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నారని గ్రహించి.. ప్రమాదం నుంచి బస్సును తప్పించేందుకు శతవిధాలా ప్రయత్నించి కుడి వైపునకు పూర్తిగా పక్కకు తిప్పాడు. ట్యాంకర్ లారీ బస్సు మధ్య భాగంలో కండక్టర్ సీటు వద్ద నుంచి, బస్సు వెనుక భాగంలో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న కడప సమీపంలోని కోగటం గ్రామానికి చెందిన బి.కమాల్‌బాషా (65), చిన్న ఓరంపాడు జ్ఞానంపల్లె దళితవాడకు చెందిన జి.శ్రీనివాసులు (60), రాజంపేట మండలం వెంకట రాజంపేటకు చెందిన కె.శేఖర్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిట్వేలి గ్రామానికి చెందిన చెవ్వు అమర్‌నాథ్‌రెడ్డి (33) కడపకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. నందలూరు మండలం ఆడపూరు గ్రామానికి చెందిన లక్ష్మయ్య(70)ను తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మంగళం వద్ద చనిపోయాడు.

గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలింపు

తిరుపతిలోని శ్రీ చైతన్య బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నిఖిత, వెన్నెలకు తీవ్రంగా గాయాలు కావడంతో.. 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు. కళాశాలకు హోం సిక్ హాలీడేస్ ఇవ్వడంతో సిద్దవటం గ్రామానికి చెందిన నిఖిత, నందలూరు ఎర్రచెరువుగ్రామానికి చెందిన వెన్నెల తన స్నేహితులతో కలిసి బస్సులో తిరుపతి నుంచి బయలుదేరారు. మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

- తీవ్రంగా గాయపడిన కొందరిని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. చిన్న ఓరంపాడు దళితవాడకు చెందిన జి.శ్రీనివాసులు రాజంపేటకు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. పది నిమిషాల్లోపు ప్రమాదం జరిగి మృత్యువాత పడ్డాడు. కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న శ్యామలాదేవి భర్త కె.శేఖర్ తిరుపతి నుంచి రాజంపేట మండలం వెంకట.. రాజంపేటకు వస్తుండగా మృతి చెందాడు.

స్తంభించిన ట్రాఫిక్

ట్యాంకర్ బస్సును ఢీకొని రోడ్డు మధ్యలో పడిపోవడంతో దాదాపు మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రైల్వేకోడూరు నుంచి పుల్లంపేట వరకు వాహనాలు నిలిచిపోయాయి. రాజంపేట డీఎస్పీ చైతన్య, రైల్వే కోడూరు సీఐ నరసింహులు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, కడప, రాజంపేట డిపో మేనేజర్లు డిల్లీశ్వరావు, రమణయ్య, రాజంపేట, కడప ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్లు మాధవీలత, కన్యాకుమారి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్యాంకర్, బస్సును భారీ క్రేన్ల సాయంతో పక్కకు తొలగించారు. ప్రమాద విషయం తెలియగానే మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికుల హాహాకారాలతో సంఘటనా స్థలం దద్దరిల్లింది. చుట్టుపక్కల గ్రామాల యువత, ప్రజలు స్పందించి గాయపడిన వారిని అంబులెన్స్‌లు, 108 వాహనాల్లో తరలించేందుకు తమ వంతుగా సహకారాన్ని అందించారు.



మృతి చెందిన కమాల్‌బాషా



కె.శేఖర్ (ఫైల్)



జి.శ్రీనివాసులు



అమర్‌నాథ్‌రెడ్డి (ఇన్‌సెట్) ఫైల్ ఫొటో

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి బాధాకరం

- ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: అన్నమయ్య జిల్లా చిన్నఓరంపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఐదుగురు మృతిచెందడం బాధాకరమని ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున రెడ్డి అన్నారు.తాను ఆదివారం ప్రమాదం జరిగిన ప్రదేశాని వెళతానని, క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరిశీలిస్తానన్నారు. అలాగే మృతి చెందిన కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చైర్మన్ పేర్కొన్నారు.

వైఎస్సార్ ఏఎఫ్‌యూ పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వైఎస్సార్ ఎఎఫ్‌యూ వీసీ ఆంజనేయ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ సైన్సు ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండో, మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఆంజనేయప్రసాద్ శనివారం విడుదల చేశారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నాలుగో సెమిస్టర్ కాలేజ్ ఆఫ్ సైన్స్, ఆర్ట్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లో 69 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందు పరిచామన్నారు. అతి తక్కువ సమయంలో పరీక్ష ఫలితాలను విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్ష విభాగాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్ష నియంత్రణ అధికారి ఈసీ సుప్రియ, పరీక్షల నియంత్రణ సహాయ అధికారి ఉదయ్ ప్రకాష్‌రెడ్డి, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

రైతును శాస్త్రవేత్త చేయడమే లక్ష్యం

- ప్రకృతి వ్యవసాయాన్ని దేశ వ్యాప్తంగా తీసుకెళ్లాలన్నదే సీఎం ధ్యేయం
- మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, తదితరులు



జెండా ఊపి డ్రిప్, స్పింక్లర్ పరికరాల వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

పులివెందుల/రూరల్: వ్యవసాయం చేసే రైతును శాస్త్రవేత్తగా చేయాలని దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మొదటిసారిగా పులివెందులలో ఉన్న ఏపీ కార్ల్‌లో రైతు శాస్త్రవేత్త శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారని వ్యవసాయ శాఖ రాష్ట్ర మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏపీ కార్ల్‌లో ఏర్పాటు చేసిన రైతు శాస్త్రవేత్త శిక్షణా శిబిరం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. ఏపీ కార్ల్ సీఈఓ రమణారెడ్డి మంత్రికి స్వాగతం పలికారు. అలాగే ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పరిశీలించారు. అంతకముందు ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలను, రైతు శాస్త్రవేత్త శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రైతన్న సుభిక్షంగా ఉండాలన్న ఉద్దేశంతో సీఎం ఎన్నో పథకాలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక గతంలో ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లమని.. కానీ జగనన్న ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు ఈ రోజు మంచి ఆదాయాన్ని చవి చూస్తున్నారన్నారు. ఎటువంటి రసాయన పదార్థాలు, క్రిమిసంహారక మందులు వాడకుండా పంట దిగుబడి వచ్చిన తర్వాత ఇతర దేశాలకు కూడా దీన్ని ఎగుమతి చేసే విధంగా ప్రణాళికలు కూడా జరుగుతున్నాయన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో శాస్త్రవేత్తగా రైతు ఉండే విధంగా తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ రైతు మరికొంతమందికి ఏ పంట సాగు చేయాలో అవగాహన కల్పిస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లాలన్నదే సీఎం లక్ష్యమని అన్నారు. జాతీయస్థాయి సమావేశాలలో మన ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి మూడు అంశాలపై చర్చ జరుగుతుందని.. అందులో ప్రధానంగా మన రైతులు చేస్తున్న వ్యవసాయం సంబంధించి మాట్లాడుతున్నప్పుడు ఎంతో సంతోసంగా అనిపిస్తుందన్నారు. ఈ ప్రకృతి వ్యవసాయంవల్ల భూసారం సామర్థ్యం పెరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో వ్యవసా యంలో ఏపీ రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. రైతు సాధికార సంస్థ, ఐఏఎస్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడంవల్ల భూసార్థ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. రైతు శాస్త్రవేత్త నైపుణ్య శిక్షణకు సంబంధించి ఇండిగో గ్రీన్ గ్లోబెల్ అకాడమి ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ లర్నింగ్ విత్, జర్మనీ ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. శిక్షణకు నాలుగేళ్లు ఉంటుందని.. 75 శాతం థియరీపైనే ఉంటుందని తెలిపారు. శాస్త్రవేత్తగా శిక్షణ పొందాలంటే ఇంటర్, డిప్లమో, డిగ్రీ చదివి ఉండాలని, వారికి మాత్రమే ఇక్కడ అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అక్కడికి వచ్చి న రైతులకు ఇతర దేశాలలో ఉన్న శాస్త్రవేత్తలతో ఆన్‌లైన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో జేసీ గణేష్ కుమార్, వ్యవసాయ, ఉద్యా న శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఏపీ కార్ల్ సీఈ ఓ రమణారెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, వ్యవసాయ శాఖ జిల్లాఅధికారి నాగేశ్వరరావు, ఏడీఏ అశోక్ రెడ్డి, స్పెషలాఫీసర్ శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, ఉద్యాన బోర్డు రాష్ట్ర మెంబర్ శివప్రసాద్‌రెడ్డి మెంటార్లు హాజరయ్యారు.

రైతులకు డ్రిప్ పరికరాల పంపిణీ

పులివెందుల : పట్టణంలోని ఏపీ కార్ల్‌లో వ్యవసాయ శాఖ రాష్ట్ర మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి రైతులకు సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 5ఎకరాలలోపు కలిగిన అన్ని వర్గాల రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.2.18లక్షల వరకు, 5-10 ఎకరాల విస్తీర్ణం కలిగిన రైతులకు 70శాతం సబ్సిడీతో రూ.3.46లక్షల వరకు రాయితీతో ప్రభుత్వం రైతులకు అందిస్తోందన్నారు. అలాగే 5ఎకరాలలోపు ఉన్న రైతులకు 55శాతం సబ్సిడీతో, 5-10ఎకరాలు ఉన్న వారికి 45శాతం సబ్సిడీతో స్పింక్లర్లను సబ్సిడీతో ఇస్తోందన్నారు. అంతముందు డ్రిప్, స్పింకర్ల పరికాలకు సంబంధించిన వాహనాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

రైతులుఅధిక లాభాలు గడించాలి



డిగ్రీ చదివాక వ్యవసాయం మీద మక్కువతో 15ఏళ్లుగా వ్యవసాయం సాగు చేస్తున్నాను. సీఆర్పీగా పనిచేస్తున్నా. నేచురల్ ఫార్మింగ్ ద్వారా నెలకు రూ.25వేల రూ.30వేలు అధిక లాభాలు గడించేలా రైతులను తీర్చదిద్దడమే మా లక్ష్యం. నాలుగేళ్లలో పూర్తిస్థాయిలో నిష్ణాతులైన రైతు శాస్త్రవేత్తలను గ్రామీణ స్థాయిలో ఆర్‌బీకేలలో శాస్త్రవేత్తలుగా అపాయింట్‌మెంట్ చేయడం జరుగుతుంది. - రామ్మోహన్‌రెడ్డి (మెంటార్), సత్యసాయి జిల్లా

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌లో భాగస్వామి కావడం అదృష్టం



సాధారణ డిగ్రీ చదివిన నేను కొంత కాలంగా.. వ్యవసాయ శాఖ అనుబంధగా మహిళా రైతులకు శిక్షణా తరగతులను నిర్వహించే దాన్ని. ఇప్పటికే ఎంతో మందికి వ్యవసాయంలో మెలకువలు తెలియజేశాను. రైతు సాధికార సంస్థ ద్వారా యువ రైతులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే అవకాశం లభించడం ఆనందంగా ఉంది. ఆరోగ్యాంధ్రప్రదేశ్‌లో భాగస్వామి కావడం అదృష్టం. - నీలావతి(మెంటార్), లింగాల మండలం, వైఎస్సార్ జిల్లా

ముగిసిన స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో స్థానిక నూర్జాహన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మొదటి రోజు 177 మందికి, రెండో రోజైన శనివారం 130 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి, నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రీజనల్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహించి, అర్హులకు ఉద్యోగాలు కల్పించామని అన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరిండెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ అతావుల్లా, వినీష, ఎంవీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప మీదుగా తిరుపతి-జాల్నా-తిరుపతి మధ్య నడిచే స్పెషల్ రైలు (07413/ 14) గడువును పొడిగించారని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డి.నరసింహారెడ్డి తెలిపారు. ఈ రైలు ప్రతి మంగళవారం తిరుపతి నుంచి సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి కడపకు 8.38 గంటలకు చేరుతుందన్నారు. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా ఈ రైలును నవంబరు 26 వరకు పొడిగించారన్నారు. అలాగే జాల్నా-తిరుపతి మధ్య నడిచే రైలును అక్టోబరు 1 వరకు నడపనున్నారన్నారు.

మహిళపై దౌర్జన్యం.. కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హనుమప్పవీధిలో నివాసం వుంటున్న విజయలక్ష్మి అదే వీధికి చెందిన పీర్‌బాషకు రూ. 5 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఈక్రమంలో ఆ డబ్బులను అడుగగా శుక్రవారం రాత్రి వేళ మద్యం తాగి పీర్‌బాష ఆమె ఇంటికి వెళ్లి దౌర్జన్యానికి పాల్పడి, దుర్భాషలాడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ జయరాముడు తెలియజేశారు.

కుమార్తెను చంపిన తండ్రికి రిమాండ్

లింగాల : మండల పరిధి ఎగువపల్లె గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ తండ్రి కన్న కుమార్తెను కడతేర్చారని సీఐ బాలమద్దిలేటి అన్నారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 జనవరిలో ఎగువపల్లె గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఆయన కుమార్తె అయిన జయంతిని కడతేర్చి ఆత్మహత్య సృష్టించినట్లు పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలిందన్నారు. దీనిపై విచారణ నిర్వహించామన్నారు. శనివారం నారాయణరెడ్డిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా.. కడప సబ్‌జైలుకు రిమాండ్ చేయడం జరిగిందన్నారు.

ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రధానాచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ అదే విధంగా ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 40 సంవత్సరాల గరిష్ట వయసు వరకు దరఖాస్తుకు అర్హులన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తును ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. రిజిస్టర్ చేసుకున్న వివరాలు సరి చూసుకుని వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించని పక్షంలో వారు అడ్మిషన్ పొందుటకు అర్హతమ పొందరన్నారు. కావున అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో, మెయిల్ ఐడి, ఫోన్ నంబర్ తీసుకుని తమకు దగ్గరలోని ఏ ప్రభుత్వ ఐటీఐ నుంచి అయినా ఉచితంగా రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్‌ను చేయించుకోవాని తెలిపారు. అభ్యర్థులు తాము చేరదలచుకున్న ఐటీఐ పేర్లను రిజిస్ట్రేషన్ సమయం నమోదు చేయవలెనని చెప్పారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లా వ్యవసాయ సంచాలకుల వారి కార్యాలయం, ఓ-బ్లాక్, కొత్త కలెక్టరేట్ వై.ఎస్.ఆర్ జిల్లా, కడప.

సూచిక: C2/499/2023 తేది: 22.07.2023.

పత్రికా ప్రకటన

పులివెందుల ఏరియా డెవలప్మెంట్ ఏజెన్సీ నిధుల ద్వారా కడప జిల్లా నందు 9184.884 హెక్టార్లకు గాను 9184 వాటర్ క్యారింగ్ పైపులు సరఫరా కొరకు టెండర్లు కోరడమైనది, పూర్తి వివరములు టెండర్ డాక్యుమెంట్ నందు పొందుపరచడమైనది. 29.07.2023 తేది సాయంత్రము 05.00 గంటల లోపు సీల్డ్ టెండర్లు దాఖలు చేయవలెను. 31.07.2023 వ తేదిన మధ్యాహ్నము 2.00 గంటలకు టెండర్లు ఖరారు చేయబడును. జిల్లా వ్యవసాయ సంచాలకులు, కడప వారి పేరు మీద రూ.5000/- డీ.డీ రూపంలో తీసుకొని 23.07.2023 తేది నుండి 29.07.2023 ల మధ్యలో జిల్లా వ్యవసాయ సంచాలకులు, కడప కార్యాలయము పని రోజులల్లో ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రము 05.00 గంటల లోపు సమర్పించిన టెండర్ ఫారం లను పొందగలరు, మరియు EMD 2% గా నిర్ణయించడమైనది, ఇతర వివరములకు 7995105733 మరియు 8331057289 నెంబర్లను సంప్రదించగలరు.

సం/- జీ. గణేశ్ కుమార్, I.A.S
సంయుక్త కలెక్టర్ మరియు చైర్మన్, DPC, వై.ఎస్.ఆర్ జిల్లా, కడప.

ఆలయాలకు స్వయం ప్రతిపత్తి

- అర్చకుల సంక్షేమం కోసం ప్రభుత్వ వరాలు
- ధార్మికుల్లో సర్వత్రా హర్షం



స్వతంత్ర ప్రతిపత్తి పొందనున్న కడప నగరం గడ్డిబజారు శివాలయం

జిల్లాలోని దేవాలయాలు	3200
ఈఓల నిర్వహణలో ఉన్నవి	185
రూ.5 లక్షల్లోపు ఆదాయంగలవి	139
ప్రభుత్వ నిర్ణయాలతో లబ్ధిపొందనున్న కుటుంబాలు	300
అర్చకులకు వరంగా లభించిన పథకాలు	5

కడప కల్చరల్ : జిల్లాలోని పలు దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి లభించింది. ఇంతవరకు జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ పరిధిలో ఉండి వార్షికాదాయం కేవలం రూ. 5 లక్షల్లోపు ఉన్న ఆలయాలు ఇకపై స్వతంత్రంగా వ్యవహరించనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అర్చకుల సంక్షేమం కోసం పదవీ విరమణ వయస్సు పెంపు, చిన్న ఆలయాలకు స్వేచ్ఛ, వంశ పారంపర్య హక్కు పునరుద్ధరణ, అర్చకుల వేతనాలు పెంచడం తదితర నిర్ణయాలు తీసుకోవడంతో ప్రభుత్వం తమకు అనుకూలంగా సాహసోపేత చర్యలు చేపట్టిందని, దీంతో జిల్లాలోని చిన్న ఆలయాలు కూడా త్వరలో అభివృద్ధిలోకి వచ్చే అవకాశం ఉందని ధార్మికవేత్తల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అర్చకులకు ప్రభుత్వ వరాలు

ఇటీవల అర్చకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు వరాలిచ్చింది. దేవదాయశాఖ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62–65కు పెంచడంతో ఆలయాల్లో టైం స్కేలులో పని చేస్తున్న అర్చకులకు మరో మూడు సంవత్సరాలు సేవలు అందించే అవకాశం లభించింది. దేవదాయశాఖ పరిధిలో పనిచేస్తున్న అర్చకులకు మరో రూ. 5 వేలు జీతం పెరిగింది. వంశ పారంపర్య హక్కు పునరుద్ధరణ జరిగింది. దీనికితోడు ప్రస్తుతం రూ. 5 లక్షల్లోపు వార్షికాదాయం గల ఆలయాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడంతో అర్చక పురోహిత వర్గాలలో ఆనందం వెల్లువెత్తుతోంది.

జిల్లాలో మొత్తం 3200 దేవాలయాలు ఉండగా ఈఓల పరిధిలో 185 ఉన్నాయి. రూ. 5 లక్షల వార్షికాదాయంగల ఆలయాలు 139 ఉన్నాయి. ముఖ్యంగా కడపతోపాటు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, మైదుకూరు, పెండ్లిమర్రి, ఖాజీపేట తదితర ఆలయాలకు స్వయం ప్రతిపత్తి లభించినట్లయింది. వంశ పారంపర్యహక్కు పునరుద్ధరించడంతో దాదాపు 50 దేవాలయాల్లోని వంద మందికి పైగా వంశ పారంపర్య హక్కుగల అర్చకులకు మేలు జరగనుంది. స్వేచ్ఛ లభించిన ఆలయాల్లో ఆదాయం లేకపోయినా భక్తుల సెంటిమెంట్లపై బలంగా ప్రభావం చూపుతున్న గ్రామ దేవతలు, అటవీ ప్రాంతంలోని దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి లభిస్తోంది. దీంతో ఆయా ఆలయాల అర్చకులకు నిర్వాహక కమిటీ చైర్మన్లు, పాలక మండలి సభ్యులకు అయాచితంగా అధికారాలు లభిస్తున్నాయి. ఆలయానికి సంబంధించి పూజాధికాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణ వారి ఆధీనంలోనే ఉంటుంది. ఆలయ అభివృద్ధి కోసం నిధుల సేకరణ, ఖర్చుపై కూడా జిల్లా దేవదాయశాఖలోని కార్యనిర్వహణాధికారు(ఈఓ)ల ప్రమేయం ఉండదు. కానీ ఆలయ చర, స్థిర ఆస్తులపై జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పర్యవేక్షణ ఉంటుంది. దీంతో ఆలయ అభివృద్ధిపై అర్చకులు, పాలక మండలి బాధ్యత పెరగడంతోపాటు మంచి పేరు లభిస్తుంది గనుక ఆలయాలు త్వరగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

కడప నగరంలోని దేవదాయశాఖ పరిధిలోగల మూడు దేవాలయాలు రూ. 5 లక్షల్లోపు ఆదాయం కలిగి ఉన్నాయి. బాగా ప్రాచుర్యంలో ఉన్న మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయం ఉప ఆలయాలకు ఇకపై స్వేచ్ఛ లభిస్తుంది. దేవదాయశాఖ అధికారుల ప్రమేయం ఉండదు. దీంతోపాటు గడ్డిబజారులోని శ్రీ కామకోటి కళాంబదేవి ఆలయం, జౌళి బజారు (బీకేఎం వీధి)లోని శ్రీ కోదండ రామస్వామి ఆలయం, పాతకడపలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం, రామకృష్ణ హైస్కూలువద్దగల శ్రీ రామగిరి బాబా మఠం కూడా రూ. 5 లక్షలలోపు ఆదాయం గల ఆలయాలుగా గుర్తింపు లభించింది.

ఆలయ వ్యవస్థ అభివృద్ధికి దోహదం



అర్చకుల పదవీ విరమణ వయస్సు పెంపు, వంశ పారంపర్య హక్కు పునరుద్ధరణ; జీతం పెంపు, చిన్న ఆలయాలకు స్వేచ్ఛ తదితర ప్రభుత్వ నిర్ణయాలు జిల్లాలో దేవాలయాల వ్యవస్థ అభివృద్ధికి దోహదపడనున్నాయి. అర్చకుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

– కె.శంకర్ బాలాజీ, అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ

సీఎం నిర్ణయం సాహసోపేతం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అర్చకుల సంక్షేమానికి తీసుకున్న నిర్ణయం నిజంగా సాహసోపేతం. వంశపారంపర్య హక్కు పునరుద్ధరణతో అర్చక వ్యవస్థకు భవిష్యత్తులో యువత నుంచి ప్రోత్సాహం ఉంటుంది. సీఎంకు కృతజ్ఞతలు.

– విజయ్‌భట్టర్, ఏపీ అర్చక సమాఖ్య అధ్యక్షులు, కడప

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి



సర్వేశ్వర్‌రెడ్డి (ఫైల్) నరేష్ (ఫైల్)

బ్రహ్మంగారి మఠం : మండలంలో శనివారం వేర్వేరు సంఘటనలలో ఇద్దరు మృతి చెందారు. చౌదరవారిపల్లె గ్రామానికి చెందిన పోలు సర్వేశ్వర్‌రెడ్డి(54) సగిలేటి వాగుకు ఇసుకకు వెళ్లి ఇసుక ర్యాంపు మీద పడడంతో మృతి చెందాడు. సాగర్‌రోడ్డులోని తెలుగుగంగ కాలనీ సమీపంలో నివసిస్తున్న కొనగాని నరేష్(35) ఇంట్లో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. నరేష్‌కు భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. తెలుగుగంగ కాలనీలో టిఫన్ సెంటర్ నిర్వహించే వాడు. శనివారం సాయంత్రం టిఫన్ సెంటర్ దగ్గర విద్యుత్ తీగను సరిచేస్తుండగా చేతికి కరెంట్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బి.మఠం పోలీసులు కేసు నమోదు చేసుకొని సర్వేశ్వర్‌రెడ్డి, నరేష్‌ల మృతదేహాలను బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం చేయించి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



కడప అర్బన్ : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కుటుంబాలకు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు రూ.1,50,000 చొప్పున ఆర్థిక సాయాన్ని ఎస్.ఈ.బి అదనపు ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ శనివారం అందజేశారు. పులివెందులకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ జి.నాగేశ్వరరెడ్డి సతీమణి అనసూయ, క్లీనర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన ఏ.బహదూర్ ఆలీఖాన్ సతీమణి గౌసియాలకు ఒక్కొక్కరికి 'సహాయత' క్రింద రూ. 1,50,000 చెక్కులను ఎస్.ఈ.బి అదనపు ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఈ.బి ఇన్‌స్పెక్టర్ నాయకుల నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

కడప కోటిరెడ్డిసర్కిల్/రూరల్ : స్వయం సహాయక మహిళా సంఘ సభ్యులు తాము తీసుకుంటున్న రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌నాయక్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా సమాఖ్య కార్యాలయంలో 35 మండలాల మహిళా సమాఖ్యల ఆర్థిక నిర్వహణ, ఆర్థిక పాలసీ విధానాలపై ఏపీఎంలకు రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఎంలు ఎస్‌హెచ్‌జీల బలోపేతానికి కృషి చేయాలన్నారు. మహిళా సభ్యులను చైతన్యవంతులను చేసి వారు ఆర్థిక వనరులను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అలాగే ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. గ్రామాల్లో పొదుపులు, పెట్టుబడులు, మార్కెటింగ్, పుస్తక నిర్వహణలో పారదర్శకతను పాటించాలన్నారు. కార్యక్రమంలో 35 మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న బీమా ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పి.సతీష్

కడప కల్చరల్ : ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం కాగలవని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పి.సతీష్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయ ఆవరణలో జరిగిన యూనియన్ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీన పరచడం, అస్థిత్వ ధోరణులు, కార్మిక హక్కుల నిర్వీర్యం నేడు కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలని, వీటిని అధిగమిస్తే ఉత్తమ భవిష్యత్తు ఉంటుందని అన్నారు. జోనల్ సంయుక్త కార్యదర్శి డి.తిరుపతయ్య మాట్లాడుతూ వస్తు సేవల పన్ను, ఐడీ ఆర్‌డీఏ సృష్టిస్తున్న సమస్యలను నేడు బీమా రంగం ఎదుర్కొంటోందన్నారు. ఈ నేపథ్యంలో ఎల్ఐసీ పాలసీదారుల ఇన్వెస్టర్ల, కష్టమర్ల నమ్మకం కొనసాగేలా వారికి త్రికరణ శుద్ధిగా సేవలు అందించాలన్నారు. ఐసీఈయూ కడప డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, శ్రామిక మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణా తరగతుల్లో యూనియన్ నేతలు అక్బర్‌బాష, వారిజాతమ్మ, రాజు, అయ్యవారురెడ్డి, ఖాన్, కుమార్, శ్రీకృష్ణ, వసుప్రద, హబీబ్, శేఖర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, గుప్తా, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ వై.సురేష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సిబ్బంది జవాబుదారీతనంతో పని చేయాలని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మెప్మా పీడీ వై.సురేష్‌రెడ్డి అన్నారు. శనివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో మెప్మా సిబ్బందితో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే మెప్మా సిబ్బంది క్రమశిక్షణ, పారదర్శకంగా, జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవాలని, నగదు లావాదేవీలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఆర్‌పీల పనితీరుపై నిఘా ఉంచాలని సీఓలకు సూచించారు. మెప్మా చేపడుతున్న కార్యక్రమాలపై రెండు జిల్లాల్లోని సీఓల వారీగా సమీక్షించి ప్రగతికి సంబంధించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం విభాగం నుంచి ఏఓ శివప్రసాద్‌రెడ్డి, ఐబీ ఎఫ్రాయిమ్, ఎల్‌హెచ్‌బీ నాగరాజు, బీఎల్‌డీ గోపీనాథ్, సీఓలు, డీఈఓలు పాల్గొన్నారు.

తల్లి,పిల్లల అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. మండలంలోని కొత్త ఇండ్లు పంచాయతీ రంగారెడ్డికాలనీకి చెందిన పల్లెభానుప్రకాష్ భార్య పల్లె శిల్ప(35) ఈనెల 19న పట్టణంలోని మోతీనగర్ నెహ్రూ ట్యుటోరియల్స్ వద్దకు వెళ్లి ట్యూషన్‌లో ఉన్న ఇద్దరు పిల్లలు సాయితేజ(14), వరుణ్‌సాయి(12)లను తీసుకుని వెళ్లిపోయింది. పిల్లలను తీసుకువస్తానని చెప్పిన భార్య, పిల్లలు ఎంతసేపటికీ రాకపోవడంతో అనుమానం వచ్చిన భర్త భానుప్రకాష్ బంధువులు, తెలిసిన వారి ఇంటి వద్ద విచారణ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో భార్య, పిల్లల అదృశ్యంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ శివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ డాక్యుమెంట్లతో సిమ్ కార్డులు విక్రయిస్తే చర్యలు



కేకేఎన్ అన్బురాజన్, జిల్లా ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలోని కొందరు ఏజెంట్లు, సిమ్ కార్డు విక్రయదారులు నకిలీ డాక్యుమెంట్లతో విచ్చలవిడిగా సిమ్‌కార్డులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి వారిపై నిఘా వుంచామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. తప్పుడు ఆధార్ ద్వారా సిమ్ కార్డులు విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అపరిచితులెవరు అడిగినా, ఆధార్, పాన్ లాంటి కీలక గుర్తింపు కార్డులు ఇవ్వవద్దని సూచించారు. ఇతరుల ఆధార్ గుర్తింపుతో మొబైల్ సిమ్‌కార్డులు పొంది సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్, ఈ–కేవైసీ అప్‌డేట్ మోసాలు, తీవ్ర వాద కార్యకలాపాలకు పాల్పడే నేరగాళ్లు అక్రమంగా వినియోగిస్తున్నారన్నారు.

- సరైన ఆధారాలు ఉన్న వారికే సిమ్ కార్డులు విక్రయించాలని సిమ్ కార్డు విక్రేతలకు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన సిమ్ కార్డు విక్రేతలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- సైబర్ నేరాల బారిన పడ్డవారు వెంటనే ఎన్.సి.ఆర్.పి (నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్)లో ఫిర్యాదు చేసేందుకు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఎన్.సి.ఆర్.పి పోర్టల్ ద్వారా వచ్చిన సదరు ఫిర్యాదుపై విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామని వివరించారు.

లోక్ అదాలత్‌లో 52 కేసుల పరిష్కారం



కడపలో కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కడప అర్బన్ : జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులు (ఎంవీఏటీపీ), భూసేకరణ (ఎల్ఏఓపీ) కేసులకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు బెంచీలు ఏర్పాటు చేశారు. కడప, ప్రొద్దుటూరు, రాయచోటిలో ఏర్పాటు చేశారు. మొత్తం 52 కేసులు పరిష్కరించారు. రూ. 3,18,15,000 కక్షిదారులకు నష్టపరిహారంగా చెల్లించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి కేసులను పరిష్కరించారు. మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌ను నిర్వహించిన న్యాయమూర్తులు ఇంతియాజ్ అహ్మద్, ఇతర న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, సంబంధిత విభాగాల అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు.

వాహనం ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన విద్యార్థి కమల్

బి.కోడూరు : మండలంలోని విజయనగర్ కాలనీ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఐత్రంపేట ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి కమల్ పాఠశాల ముగిసిన తర్వాత తన స్వగ్రామమైన విజయనగర్ కాలనీకి ఆర్టీసీ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా.. పోరుమామిళ్ల నుండి అతివేగంగా వస్తున్న తుఫాను వాహనం ఢీకొంది. విద్యార్థి తలకు తీవ్ర గాయాలు కావడంతోపాటు చెవులు, ముక్కుల నుంచి రక్తస్రావమైంది. వెంటనే విద్యార్థిని పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు. విద్యార్థిని ఢీకొన్న వాహనం ఆపకుండా వెళుతుండగా బద్వేలు ఎస్ఐ వెంకటరమణ బద్వేలు పరిసర ప్రాంతాల్లో వాహనాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ మద్యం సేవించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు బి.కోడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ బృందం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) లో శనివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ఆదేశాల మేరకు రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసూమ్‌బాష ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో వైద్యులు, సిబ్బంది పనితీరు, విధుల గురించి ఆరా తీయడంతోపాటు రోగులను విచారణ చేశారు. అలాగే ఆసుపత్రికి అందించిన మందులు, పరికరాలను ఏ విధంగా వినియోగిస్తున్నారన్న దానిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ పి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ఆసుపత్రులకు అందిస్తున్న సేవలు ఏవిధంగా అమలవుతున్నాయో అనే దానిపై తనిఖీలు చేపట్టామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఓ బాలగంగాధర్ రెడ్డి, ఏఈఈ అశోక్‌కుమార్, సిబ్బంది జనార్ధన్‌రావు, క్రిష్ణనాయక్, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరవింద్‌నగర్ వార్డు సచివాలయంలో వార్డు ప్లానర్ ఉద్యోగిగా పని చేస్తున్న రామోహన్‌పై ఈ నెల 21న బి. బాలాంజనేయులు, ఎం.చంద్ర ఓబుల్‌రెడ్డి దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం నిందితులిద్దరినీ ఎస్ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు.